క్లుప్తంగా

రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపిక



భావనతో పీఈటీ ఉదయ్‌కుమార్

పెద్దపంజాణి: మండలంలోని అప్పినపల్లె జెడ్పీ హైస్కూల్లో 10వ తరగతి చదువుతున్న కె. భావన రాష్ట్రస్థాయి హ్యాండ్ బాల్ పోటీలకు ఎంపికైందని హెచ్‌ఎం నందకుమార్, పీఈటీ ఉదయ్ కుమార్ తెలిపారు. గత నెల చివరి వారం అన్నమయ్య జిల్లా మదనపల్లెలో నిర్వహించిన సెలెక్షన్స్‌లో ప్రతిభ కనబరచి అండర్–17 విభాగంలో జిల్లా జట్టుకు ఎంపికైందని, త్వరలో విజయనగరం జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీలో విద్యార్థిని పాల్గొంటుందని వారు చెప్పారు.

నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు



సమావేశంలో నిపుణులు, హాజరైన యువత

సదుం: నైపుణ్యాభివృద్ధితో ఉద్యోగావకాశాలు పొందవచ్చని శాస్త్రవేత్త డాక్టర్ కరీముల్లా అన్నారు. ఖ మండలంలోని భట్టువారిపల్లెలో బుధవారం షరీఫ్ సాహెబ్, ఫాతిమాబీ మెమోరియల్ ట్రస్ట్, ఫిరెప్ట్ ఆధ్వర్యంలో వ్యవసాయం, అనుబంధ రంగాలపై యువతకు అవగాహన సదస్సు బుధవారం నిర్వహించారు. తాము ఎంచుకున్న రంగంలో నైపుణ్యాలు పెంపొందించుకుంటే జీవితంలో స్థిరపడేందుకు అవకాశం ఉంటుందని పలువురు వక్తలు చెప్పారు. కార్యక్రమంలో బ్యాంకింగ్ రంగ నిపుణులు చంద్రారెడ్డి, రామమూర్తి, సూరిబాబు, వ్యవసాయ శాస్త్రవేత్త డాక్టర్ హేమంత్‌కుమార్, ప్రియ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటారు

పుంగనూరు: పట్టణంలోని గూడూరుపల్లె టిడ్కో కాలనీ వద్ద బుధవారం బీజేపీ నాయకులు అయూబ్‌ఖాన్, నరసింహులు, బాబు, ఉమాశంకర్ మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం, గాంధీ జయంతి పురస్కరించుకుని ఈ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు.

సారా ఊట ధ్వంసం



కుప్పం రూరల్: కుప్పం అటవీ ప్రాంతంలోని మొట్లచేను సమీపంలో దాడులు చేసి 300 లీటర్ల సారా ఊటను ధ్వంసం చేసినట్లు ఫారెస్ట్ రేంజర్ జయశంకర్ బుధవారం తెలిపారు. నాటు సారీ తయారీపై రహస్య సమాచారం అందడంతో దాడులు చేసినట్లు చెప్పారు సారా తయారీ, గంజాయి సాగు వైపు యువత మరలి జీవితాలు జైలుపాలు చేసుకోరాదని హితవు పలికారు. సారా తయారీ విషయాన్ని ఎవరైనా తమ దృష్టికి తెస్తే వారి వివరాలు గోప్యంగా ఉంచుతున్నట్లు చెప్పారు.

10 మద్యం షాపులు కేటాయింపు

కుప్పం: కుప్పం నియోజకవర్గానికి 10 మద్యం షాపులు కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ నాగరాజ్ తెలిపారు. నూతన మద్యం పాలసీ మేరకు 10 మద్యం దుకాణాల ఏర్పాటుకు టెండర్లు ఆహ్వానిస్తున్నట్లు ఆయన చెప్పారు. కుప్పం మున్సిపాలిటీకి 5, శాంతిపురం 2, రామకుప్పం 2, గుడుపల్లె 1 చొప్పు న షాపులు కేటాయించారని, వీటికి ఈ నెల 9వ తేదీలోపు ఆన్‌లైన్ ద్వారాగానీ లేదా ఎక్సైజ్ శాఖకు కానీ దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఆ తర్వాత 11వ తేదీన చిత్తూరులో లక్కీడిప్‌తో ఎంపిక చేస్తామన్నారు. మద్యం షాపుల ఏర్పాటుపై ఆసక్తి కలిగిన అభ్యర్థులు రూ.2 లక్షలు చెల్లించి దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఎక్సైజ్ ఎస్‌ఐ మోహన్‌బాబు, సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం దుకాణాలకు ఆన్‌లైన్ టెండర్లు

పలమనేరు: పలమనేరు ఎక్సైజ్ పరిధిలోని 13 మద్యం దుకాణాల ఏర్పాటుకు ఆన్‌లైన్‌లో టెండర్లు వేసుకోవాలని పలమనేరు ఎక్సైజ్ సీఐ భాగ్యలక్ష్మి తెలిపారు. స్థానిక కార్యాలయంలో ఆమె బుధవారం మాట్లాడుతూ, రూ.2లక్షలు డిపాజిట్ చెల్లించి ఒక్క ఎన్నైనా టెండర్లు వేసుకునే అవకాశాన్ని ప్రభుత్వం కల్పించిందని, ఇక షాపునకు లైసెన్సు ఫీజుగా రూ.65 లక్షలు ఏటా ఉంటుందని తెలిపారు. ఆసక్తి గల వారు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లు

పలమనేరు: దీపావళి నుంచి మహిళలకు ఉచిత గ్యాస్ సిలిండర్లను తమ ప్రభుత్వం ఇస్తుందని పలమనేరు ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి పేర్కొన్నారు. పట్టణంలోని మెప్మా కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన మెప్మా అర్బన్ మార్ట్‌ను బుధవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తమ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేరుస్తుందన్నారు. సూపర్‌బజార్ అధ్యక్షులు ఆర్వీ బాలాజీ మాట్లాడుతూ, ఇక్కడి సూపర్‌బజార్‌లో మెప్మా మహిళలలు తయారు చేసిన ఉత్పత్తులను విక్రయించుకునే అవకాశం కల్పిస్తామన్నారు. అనంతరం స్వచ్ఛతా హి సేవలో భాగంగా ఆయన మున్సిపల్ కార్యాలయ ఆవరణలో పారిశుద్ధ్య పనులను చేపట్టారు.



కిరాతకులను ఎన్‌కౌంటర్ చేయండి

- పుంగనూరులో కొవ్వొత్తులతో నిరసన
- అన్ని వర్గాల ప్రజల మద్దతు

కిడ్నాప్‌కు గురైన చిన్నారి అశ్వియ అంజుమ్(7) హత్యకు గురికావడంపై పట్టణమంతా కన్నీటిసంద్రమైంది. చిన్నారి హత్యకు నిరసనగా పట్టణంలో బుధవారం రాత్రి కులమతాలకతీతంగా పట్టణ ప్రజలంతా కొవ్వొత్తులతో భారీ ర్యాలీ నిర్వహించారు. చిన్నారి అశ్వియను పొట్టనపెట్టుకున్న కిరాతకులను వెంటనే అరెస్టు చేసి ఎన్‌కౌంటర్ చేయాలని డిమాండ్ చేశారు. రాత్రి వర్షంలోనే ఉద్విగ్నభరిత వాతావరణంలో ర్యాలీ నిర్వహించారు. సీఐ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

–పుంగనూరు

గాంధీజీ ఆశయ సాధనకు కృషి చేద్దాం

- గాంధీ జయంతి వేడుకల్లో ఎంపీ మిథున్‌రెడ్డి పిలుపు

పుంగనూరు, పలమనేరు, కుప్పం నియోజకవర్గాల వ్యాప్తంగా గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. ఆయా ప్రభుత్వ శాఖల కార్యాలయాలు, పట్టణాల్లో గాంధీ విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.





సదుం: గాంధీ చిత్రపటం ముందు నివాళులు అర్పిస్తున్న ఎంపీ మిథున్‌రెడ్డి, పుంగనూరు: గాంధీ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్

సదుం: మహాత్మాగాంధీ కలలు కన్న గ్రామ స్వరాజ్యం, ఆయన ఆశయాల సాధనకు అందరూ కృషి చేద్దామని రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్‌రెడ్డి పిలుపునిచ్చారు. గాంధీ జయంతి పురస్కరించుకుని బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో గాంధీజీ చిత్రపటానికి ఆయన పూలమాల వేసి నివాళులు అర్పించారు. అహింస, శాంతి మార్గాలతో స్వాతంత్ర్యం సాధించిన ఘనత మహాత్మునికే దక్కుతుందని గాంధీజీ ఆయన సేవలను కీర్తించారు. అధికారులు, నాయకులు పాల్గొన్నారు. అలాగే, సదుంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి పలువురు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో హెల్త్ సూపర్‌వైజర్ నీలకంఠ, సహదేవయ్య, సుబ్రమణ్యం, నాగరాజు, ధనశేఖర్, రెడ్డి నరసింహులు, హేమలత, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

పుంగనూరులో..

పుంగనూరు: మహాత్మాగాంధీ జయంతి వేడుకలు మున్సిపాలిటీలో ఘనంగా నిర్వహించారు. బుధవారం మున్సిపల్ చైర్మన్ అలీమ్‌బాషా, కమిషనర్ మధుసూదన్‌రెడ్డి ఆధ్వర్యంలో గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన సేవలను స్మరించారు. అలాగే ఎస్‌డీపీఐ నాయకులు అన్వర్, చాంద్‌బాషా, యూసుఫ్ గాంధీ విగ్రహానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు రేష్మా, సాజిదాబేగం, భారతి, మైనారిటీ నాయకులు ఇంతియాజ్‌ఖాన్, అజీజ్, వైఎస్సార్ సీపీ నాయకుడు రమణ తదితరులు పాల్గొన్నారు.

రొంపిచెర్లలో..

రొంపిచెర్ల: రొంపిచెర్ల గ్రామ పంచాయతీలో సర్పంచ్ ఇబ్రహీంఖాన్ ఆధ్వర్యంలో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్రపటానికి పూల మాలలు వేసి ఘన నివాళులర్పించారు. అలాగే మండలంలోని అన్ని గ్రామ పంచాయతీలలో గ్రామసభలను నిర్వహించారు. గ్రామ పంచాయతీల్లో డంపింగ్ యార్డులను ప్రారంభించారు. గ్రామసభలలో ఎంపీడీఓ రెడ్డెప్పచ్చారి, తహసీల్దార్ కిరణ్‌కుమార్, సర్పంచులు చిచ్చిలి అరుణమ్మ, నాగిరెడ్డి, జీవలత, మండల టీడీపీ కన్వీనర్ ఊయల రమణ, కార్యదర్శులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

గాంధీ బాటలో పయనిద్దాం

పలమనేరు: పలమనేరు మున్సిపాలిటీ, మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల వద్ద బుధవారం గాంధీ జయంతి, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయం వద్ద జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరై మాట్లాడారు. గాంధీ బాటలో అందరూ పయనించాలని కోరారు. అలాగే బాపూజీ ఉద్యానవనంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం స్వచ్ఛతా హి సేవలో భాగంగా అక్కడ పారిశుద్ధ్య పనులు చేపట్టారు. బాపూజీ పార్కులో ఉయ్యాలలు ఏర్పాటు చేసిన దాత సీతారామయ్యను అభినందించారు. విజయవాడలో వరద ప్రభావిత ప్రాంతాల్లో తమ వంతు సేవలు అందించిన స్థానిక మున్సిపల్ కార్మికులను సన్మానించారు. గల్పర్ వాహనాన్ని(సెప్టిక్ ట్యాంకు క్లీనింగ్) ప్రారంభించారు. అలాగే పట్టణంలోని పెన్షనర్ల అసోసియేషన్ కార్యాలయం, స్థానిక గ్రంథాలయం, మున్సిపాలిటీతోపాటు మండలంలోని ఆయా సచివాలయాల్లో గాంధీ, లాల్‌బహదూర్ శాస్త్రి జయంతి వేడుకలను నిర్వహించారు. కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్ రమణారెడ్డి, పెన్షనర్ల నాయకులు రత్నారెడ్డి, గురుమూర్తి, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



గాంధీ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న జెడ్పీ చైర్మన్

అహింసాయుత పోరాట ధీరుడు

- గాంధీజీని కీర్తించిన జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు

వి.కోట: సత్యం కోసం సర్వం వదులుకోవాలని సిద్ధపడి స్వాతంత్ర్యం కోసం అహర్నిశలు కృషి చేసిన మహనీయుడు గాంధీజీ అని జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు కీర్తించారు. బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మాగాంధీ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా జెడ్పీ చైర్మన్ హాజరై గాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి మాట్లాడారు. సత్యాగ్రహమే ఆయుధంగా అహింసాయుత మార్గంలో పోరాడి దేశానికి స్వాతంత్ర్యం సముపార్జించిన ధీరుడు అని స్మరించారు. ఆయన చూపిన మార్గంలో అందరూ పయనించాలని కోరారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారులు చంద్రశేఖర్, మురుగేష్, ఎంపీడీఓ కార్యాలయ సిబ్బంది, నాయకులు పాల్గొన్నారు.

గంగవరంలో..

గంగవరం: మండల పరిషత్, తహసీల్దార్, మండల విద్యాశాఖ తదితర కార్యాలయాల్లో గాంధీ జయంతి వేడుకలు నిర్వహించారు. గాంధీ చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

పెద్దపంజాణిలో..

పెద్దపంజాణి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మహాత్మా గాంధీ చిత్ర పటానికి ఎంపీడీఓ అబ్దుల్ రహీమ్ పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఆయన మాట్లాడుతూ. జాతిపిత మహాత్మా గాంధీ జీవితం ఆదర్శనీయమని, ఆయన బాటలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ చంద్రశేఖర్ రెడ్డి, పీఎస్ శ్రీనివాసులు, మండల పరిషత్ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ

పెద్దపంజాణిలోని ఆరోగ్య కేంద్రంలో బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి గడిదేశి వెంకటరమణ ఆధ్వర్యంలో రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. జిల్లా ఓబీసీ మోర్చా కోశాధికారి నక్కా రామచంద్రయ్య, వైద్యాధికారి మురళి, పార్టీ నాయకులు శ్రీనివాస యాదవ్, పగడాల ప్రభాకర్, వెంకట్రామిరెడ్డి, పాండురంగ ఆచారి, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

బైరెడ్డిపల్లెలో..

బైరెడ్డిపల్లె: గాంధీ అడుగుజాడల్లో పయనిద్దామని ఎంపీపీ మొగసాల రెడ్డెప్ప అన్నారు. మండల పరిషత్ కార్యాలయం వద్ద మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రాజేంద్రబాలాజీ, సర్పంచులు వెంకటేష్, రాజప్ప, రవిచంద్ర, రమణారెడ్డి, మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ కార్తిక్, మండల యూత్ ప్రెసిడెంట్ మహేష్, వైస్ సర్పంచ్ తబ్రాజ్, కో–ఆప్షన్ సభ్యుడు ఫైజుల్లా, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

కుప్పం నియోజకవర్గం

కుప్పం: స్థానిక ఎంఎఫ్‌సీ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో గాంధీ విగ్రహానికి సాయి మాత సేవా ట్రస్ట్ వ్యవస్థాపకులు, అధ్యాపకుడు జగదీష్ బాబు విద్యార్థులతో కలిసి, పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. గాంధీజీ సేవలను ప్రస్తుతించారు.

ద్రవిడ వర్సిటీలో...

ద్రవిడ వర్సిటీలో వైస్ చాన్సలర్ దొరస్వామి గాంధీ విగ్రహానికి నివాళులు అర్పించారు. గాంధీ అహింస మార్గం యువతకు ఆదర్శం కావాలన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో అహింసే ఆయుధంగా బాపూజీ బ్రిటీషర్లపై పోరాడి స్వాతంత్ర్యం తెచ్చారని స్మరించారు. కార్యక్రమంలో రిజిస్ట్రార్ ఆచార్య కిరణ్ కుమార్, పీఆర్‌ఓ గణేష్‌మూర్తి తదితరులు పాల్గొన్నారు.



ద్రవిడ వర్సిటీలో గాంధీకి వీసీ నివాళి



రొంపిచెర్ల: గ్రామసభలో మాట్లాడుతున్న సర్పంచ్



పలమనేరు: మున్సిపల్ కార్యాలయం వద్ద



బైరెడ్డిపల్లె: ఎంపీడీఓ కార్యాలయం వద్ద..



పలమనేరు: ఏపీ పెన్షనర్ల అసోసియేషన్ ఆధ్వర్యంలో..



కుప్పం: ఎంఎఫ్‌సీ ప్రభుత్వ కళాశాలలో..



సదుంలో..

కూటమి ప్రభుత్వ అరాచక పాలన



సమావేశానికి హాజరైన నాయకులు, ప్రజలు



సమస్యలు తెలుసుకుంటున్న ఎంపీ మిథున్ రెడ్డి

- ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత
- రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి విమర్శ
- ఎంపీ రాకతో పార్టీ శ్రేణులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం

సదుం: రాజంపేట ఎంపీ పెద్దిరెడ్డి మిథున్ రెడ్డి బుధవారం నిర్వహించిన సమావేశం వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్సాహం నింపింది. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వైఎస్సార్ సీపీ నాయకులు, కార్యకర్తలు, సానుభూతిపరులను టార్గెట్‌గా చేసుకుని టీడీపీ నాయకులు దాడులు చేయడం, ఆస్తులు ధ్వంసానికి పాల్పడటం, నియోజకవర్గంలో ఎమ్మెల్యే, ఎంపీ పర్యటించకుండా దౌర్జన్యకాండకు పాల్పడిన ఉదంతం నేపథ్యంలో పార్టీ శ్రేణుల్లో మనోస్థైర్యం పెంచేందుకు రావడం..ఆ దిశగా సమావేశాలు నిర్వహించడంతో జోష్ నింపింది. ఎవరికి ఏ సమస్య వచ్చినా అండగా ఉంటానని గట్టి నమ్మకం కల్పించారు. సమస్యల పరిష్కారానికి నేరుగా తనని కలవచ్చని, వాటి పరిష్కారానికి శాయశక్తుల కృషి చేస్తానని హామీ ఇచ్చారు. గ్రామస్థాయిలో కలిసికట్టుగా కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం హామీలు నెరవేర్చకుండా చేస్తున్న అరాచక పాలనపై నెలల వ్యవధిలోనే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత మూటకట్టుకుందన్నారు. గతంలో కంటే పార్టీ శ్రేణులు ఇప్పుడు ఎంతగానో ధైర్యంగా ఉన్నాయని, ఇలాగే కొనసాగించాలని కోరారు.

నిబంధనలకు విరుద్ధమైన పనులు ఆమోదించవద్దు

పంచాయతీలలో అభివృద్ధి బాధ్యత సర్పంచులదేనని వైఎస్సార్ సీపీ కార్యదర్శి పెద్దిరెడ్డి తెలిపారు. మండలంలో క్షేత్రస్థాయిలో పార్టీ బలంగా ఉందని, నిబంధనలకు విరుద్ధంగా గ్రామాలలో ఇతరులు చేపట్టే ఉపాధి, అభివృద్ధి పనులను సర్పంచులు ఆమోదించరాదని సూచించారు. ప్రజాప్రతినిధులు కలిసికట్టుగా ఉండాలన్నారు. గ్రామాలలో ఎన్నికల ముందు ప్రారంభించిన ప్రతి ఆర్వో ప్లాంటులో తాగునీటి సరఫరాకు ఎలాంటి ఆటంకాలు కలగకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో పెద్దిరెడ్డి సుధీర్ రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు సోమశేఖర్ రెడ్డి, పెద్దిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, వైస్ ఎంపీపీ ధనుంజయరెడ్డి, కృష్ణారెడ్డి, తిమ్మారెడ్డి, పార్టీ మండల కన్వీనర్ రెడ్డెప్పరెడ్డి, ప్రకాష్ రెడ్డి, పుట్రాజు, శివారెడ్డి, రమేష్ రెడ్డి, ఇమ్రాన్, బాబు రెడ్డి, ఉషారాణి, గురురెడ్డి, గిరిధర్ రెడ్డి, సయ్యద్ బాషా తదితరులు పాల్గొన్నారు.

మద్యం షాపులు మార్చాలి

సదుం: మండల కేంద్రంలోని ప్రధాన రహదారిలో ఉన్న మద్యం దుకాణాలు అక్కడి నుంచి మార్చాలని చేయాలని స్థానికులు ఎంపీ మిథున్ రెడ్డికి బుధవారం వినతిపత్రం అందజేశారు. ప్రధాన రహదారిపై, నివాసాల మధ్య మద్యం దుకాణం ఉండడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని చెప్పారు. మద్యం మత్తులో గొడవలు సైతం జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ దుకాణాలను గ్రామ శివార్లలో ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటానని ఎంపీ వారికి హామీ ఇచ్చారు.

కప్పలు బెక బెక.. వరుణుడు వచ్చెనిక..!





రోకలికి కట్టిన కప్పలతో చేస్తున్న ఊరేగింపు, గంగరాయికి సమర్పిస్తున్న పొంగళ్లు

- గంగినాయనిపల్లెలో ఘనంగా కప్పదేవర

బైరెడ్డిపల్లె: కొంత కాలంగా వర్షాలు సక్రమంగా కురవకపోవడంతో పంటలు ఎండుముఖం పడుతున్న తరుణంలో మండలంలోని గంగినాయనపల్లె గ్రామస్తులు బుధవారం వర్షం కోసం కప్పదేవర నిర్వహించారు. తొలుత గ్రామ సమీపంలోని పాడుబడ్డ బావిలో నుంచి కప్పలను సేకరించారు. రోకలికి ఇరువైపులా వాటిని కట్టి గ్రామంలో ఊరేగించారు. ఇంటింటికీ వెళ్లి భిక్షాటన చేశారు.ఆ తర్వాత గ్రామ సమీపంలోని దామిరొడ్డు వద్ద గంగరాయికి ప్రత్యేక పూజలు చేశారు. పొంగళ్ల వండి నైవేద్యం సమర్పించారు. గ్రామస్తులంతా బైరెడ్డిపల్లె పెద్దచెరువులో వానదేవుణ్ని వేడుకుంటూ నోరు లబ..లబ కొట్టుకుంటూ పరుగులు తీశారు. కప్పల బెకబెకలు..గ్రామస్తుల లబబ..లబలు..వరుణదేవుడు ఆలకించాడే మోగానీ సాయంత్రం అయ్యేసరికి ఒక్కసారిగా వాతావరణం మారిపోయింది. మేఘావృతమై 6.30 గంటల నుంచి ఎడతెరపిలేకుండా వర్షం కురవడంతో గ్రామస్తుల ఆనందానికి అంతులేకుండా పోయింది. ఖరీఫ్‌లో సాగు చేసి వేరుశనగ పంట చేతికందే సమయంలో వర్షం కురవడం ఆనందంగా ఉందని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.